సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 31 । జూలై । 2024


స్లీపర్‌లో కిక్కిరిసిన ప్రయాణం


గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వద్ద ప్రయాణికుల రద్దీ


గోదావరి ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌ల వద్ద ప్రయాణికుల పాట్లు

రైలు బండి.. చోటేదండీ?


జనరల్ కోచ్‌లను తలపిస్తున్న స్లీపర్ కోచ్


స్లీపర్ కోచ్‌లో ప్రయాణికుల అవస్థలు

- భారమవుతున్న రైలు ప్రయాణం
- జనరల్, స్లీపర్ కోచ్‌ల కుదింపుతో ఇబ్బందులు
- స్లీపర్, థర్డ్ ఏసీలో రిజర్వేషన్ దొరక్క అవస్థలు
- దువ్వాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్న 30కి పైగా రైళ్లు
- సాధారణ ప్రయాణికులపై రైల్వే చిన్నచూపు

విశాఖ రైల్వేస్టేషన్.. సాయంత్రం 5 గంటలు.. డిబ్రూగడ్-కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మూడో నంబర్ ప్లాట్‌ఫాంపైకి వచ్చింది. ప్రయాణికులు గుంపుగా చేరిపోయారు. అప్పటికే జనరల్ బోగీ ప్రయాణికులతో కిక్కిరిసింది. తొక్కేసుకొని ఏదో రకంగా ఎక్కేశారు. కాలు దూరే ప్లేస్ ఉంటే చాలు.. అదే ఏసీ బెర్త్ అంటూ దూసుకెళ్లారు. వందేభారత్‌లు.. అమృత్‌లు బదులు.. ఉన్న రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు ఏర్పాటు చేయవచ్చు కదా అంటూ రైల్వే శాఖను తిట్టిపోసుకుంటూ బయలుదేరారు.

సాయంత్రం 5 గంటలు.. గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం 8పైకి వచ్చింది. జనరల్ బోగీ కేవలం 2 నిమిషాల్లోనే కిక్కిరిసిపోయింది. కనీసం బాత్‌రూమ్ వైపు వెళ్లేందుకు కూడా అడుగు జాగా లేకుండా పోయింది. సాయంత్రం ఎక్కితే ఉదయాన్నే సికింద్రాబాద్‌లో దించేసే రైలు కాబట్టి.. కనీసం నిలబడి వెళ్లిపోతే చాలు.. అదే పదివేలు అంటూ నిట్టూరుస్తూ ప్రయాణికులు భాగ్యనగరం పయనమయ్యారు.

మధ్యాహ్నం 1.50 గంటలకు వచ్చే గౌహతి ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే సీన్ రిపీట్.. ఈ మూడు రైళ్లే కాదు.. ప్రతీ రైలులోని జనరల్ బోగీలో ప్రయాణమంటే యుద్ధమే. గమ్యస్థానం చేరేలోపు కూర్చోడానికైనా.. కుదరుగా నిల్చోడానికైనా ప్లేస్ దొరకబుచ్చుకున్న పేదోడే రారాజు. అలా మారిపోయింది.. కాదు కాదు.. మధ్య తరగతి ప్రయాణాన్ని అలా మార్చేసింది రైల్వే బోర్డు.

సాక్షి, విశాఖపట్నం/తాటిచెట్లపాలెం : నిత్యం లక్షలాది మంది ప్రయాణం చేసే వాల్తేరు రైల్వే స్టేషన్‌లో రైలెక్కే సామాన్యుడి పరిస్థితి దయనీయంగా ఉంది. సీట్లు తక్కువగా ఉండటం, స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇదే సమయంలో దూర ప్రాంత ప్రయాణాలకు అనువుగా ఉండే రైళ్లలో స్లీపర్ కోచ్‌ల కుదింపు ప్రక్రియను రైల్వే మంత్రిత్వ శాఖ అమలు చేయడంతో రైలు ప్రయాణం మరింత భారంగా, భయంగా మారిపోయింది. జనరల్ కోచ్‌లతో సమానంగా రిజర్వ్‌డ్ క్లాస్ కోచ్‌లు కిక్కిరిసిపోతుండటంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. విశాఖ నుంచి బయలుదేరిన మూడు రైళ్లను 'సాక్షి' పరిశీలించగా.. ఈ విషయం తేటతెల్లమైంది.

- గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మంగళవారం కిక్కిరిసి విశాఖపట్నం చేరుకుంది. ఈ రైలులో జనరల్, స్లీపర్ క్లాస్‌లలో కనీసం కాలుమోపేందుకు కూడా ఖాళీ లేదు. ఈ రైలులో 4-జనరల్, 7-స్లీపర్ కోచ్‌లుండగా మిగిలిన 8 ఏసీ కోచ్‌లే. ఓ జనరల్ కోచ్‌లో 108 మంది వరకు ప్రయాణించవచ్చు. కానీ ఈ రైలులోని ఒక్కో జనరల్ కోచ్‌లో 200 మంది కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో కేవలం 78 బెర్తులు మాత్రమే ఉంటాయి. కానీ ఈ రైలులోని స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో సుమారు 150 మంది చొప్పున ప్రయాణికులున్నారు.
- డిబ్రూగడ్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇదే విధంగా వెళ్లింది. ఈ రైలులో కేవలం మూడు కోచ్‌లను మాత్రమే సాధారణ ప్రయాణికులకు కేటాయించారు. 11 స్లీపర్, 5 ఏసీ కోచ్‌లు ఉన్నాయి. ఈ రైలులో కూడా సాధారణ, స్లీపర్ కోచ్‌ల్లో ఒక్కోదాంట్లో 150 మందికి తక్కువ కాకుండా ప్రయాణిస్తున్నారు. జనరల్ కోచ్‌ల్లో ఒక్కో సీటులో నలుగురు కూర్చోవచ్చు. కానీ కనీసం ఏడుగురు కూర్చున్నారు.
- ఉత్తరాంధ్ర వాసుల ప్రధాన రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్. ఈ రైలు ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం. ఈ రైలులోని జనరల్ కోచ్‌ల్లో కనీసం కాలుమోపలేం. కారణం ఈ రైలుకు ఉన్నవి కేవలం రెండే జనరల్ కోచ్‌లు. వాటిలో ఒక కోచ్ సగం ఆర్‌ఎంఎస్‌కు కేటాయిస్తారు. దీంతో జనరల్ కోచ్‌ల్లో ప్రయాణించడం అసాధ్యం. ఇక ఈ రైలుకు గతంలో 12 స్లీపర్ క్లాసు కోచ్‌లుండేవి. కానీ ప్రస్తుతం వీటి సంఖ్య 8కి పడిపోయింది. స్లీపర్ క్లాస్ కోచ్‌ల స్థానంలో ఏసీ కోచ్‌లను జతచేసి.. స్లీపర్, జనరల్ కోచ్‌లను తగ్గించేసింది.


డిబ్రూగడ్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ స్లీపర్ క్లాస్ కోచ్‌ల వద్ద రద్దీ


6 గురు ప్రయాణించే సీట్లలో పది మందికి పైనే..

ప్రధాన రైళ్లు రద్దు.. స్పెషల్ రైళ్ల వైపు మొగ్గు

ప్రయాణికులకు అత్యంత డిమాండ్ ఉన్న రైళ్లను సైతం తరచూ రద్దు చేస్తోంది. దీని వల్ల మధ్య తరగతి కుటుంబాలకు ప్రయాణాలు చేయాలంటే కష్టంగా మారింది. గత ఆరు నెలల నుంచి విశాఖపట్నం-విజయవాడ మధ్య పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఇదే మార్గంలో నడిచే వందే భారత్ రైళ్లు, పలు స్పెషల్ రైళ్లు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉన్న కొద్దిపాటి రైళ్లలో సాధారణ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తగ్గించి, ఏసీ కోచ్‌ల వైపు రైల్వే మొగ్గు చూపుతోంది. దీంతో కొన్ని సార్లు స్లీపర్ క్లాస్ కోచ్‌లు కూడా సాధారణ కోచ్‌ల కంటే దారుణంగా ఉంటున్నాయి.

బైపాస్‌తో మరింత భారం

విశాఖ రైల్వేస్టేషన్‌లో మొత్తం 8 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. అయితే రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో శివార్లలో రైళ్లను గంటల తరబడి నిలిపేస్తున్న పరిస్థితులు దాపురించాయి. అందుకే కొన్ని రైళ్ల సర్వీసులను దువ్వాడ వైపుగా దారి మళ్లించేస్తున్నారు. విశాఖకు రాకుండా ప్రస్తుతం 30కి పైగా రైళ్లు బైపాస్ నుంచి వెళ్లిపోతుండటం ప్రయాణికుల కష్టాలను మరింత పెంచుతున్నాయి.

వెయిటింగ్ కంటే.. ఇదే నయం

సాధారణంగా రైలు ప్రయాణమంటే.. కచ్చితంగా ముందస్తు ప్లాన్ అవసరం. మూడు నెలల ముందే రిజర్వేషన్ ఓపెన్ చేస్తారు. కేవలం రోజుల వ్యవధిలోనే దాదాపు 80 శాతం రైళ్ల సీట్లు రిజర్వ్ అయిపోతుంటాయి. ఇక వెయిటింగ్ లిస్ట్ చూస్తే.. 150, 200, 250.. ఇలా సెంచరీల మీద సెంచరీలు కొడుతుంటుంది. కన్ఫర్మ్ అవుతుందన్న ఆశ పూర్తిగా చచ్చిపోతుంటుంది. వెయిటింగ్ లిస్ట్‌పై స్లీపర్ క్లాస్‌లో వెళ్లి.. అందరితో చీవాట్లు తినే బదులు.. జనరల్ బోగీలో వెళ్లి కాస్తా ఓపికపడితే చాలు అని ప్రతి ఒక్క ప్రయాణికుడు భావిస్తున్నారు.

ఏసీ కోచ్‌లకు డిమాండ్

స్లీపర్ కోచ్‌లు రిజర్వ్ ఫుల్ అయిన వెంటనే.. థర్డ్‌ఏసీ, సెకండ్ ఏసీ, ఫస్ట్‌క్లాస్‌పై పడుతున్నారు. దీంతో ఆ బోగీలకు కూడా డిమాండ్ పెరిగిపోతోంది. అందుకే స్లీపర్, జనరల్ బోగీలు తగ్గించి.. ఆదాయం పెంచుకునేందుకు రైల్వే శాఖ ఏసీ కోచ్‌లు పెంచుతూ.. పేదోడి ప్రయాణాన్ని మరింత భారంగా మార్చేసింది.

జనరల్ బోగీ.. కిక్కిరిసి..



ప్రతీ రోజు గోదావరి ఎక్స్‌ప్రెస్ పరిస్థితి ఇంతే. జనరల్ కోచ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నాం. విజయవాడ వరకు వెళ్లేందుకు ఈ రైలెక్కా. ఇది తప్ప వేరే రైలు లేకపోవడంతో అందరూ ఇదే రైలుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ రైలులో జనరల్ కోచ్‌లు కేవలం రెండే ఉన్నాయి. స్లీపర్ కోచ్‌ల్లో ఎక్కాలంటే ఫైన్ కట్టాలి. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా వేలాడుతూ వెళ్తున్నా..

– పి.ప్రవీణ్, శ్రీకాకుళం

రైల్వే మినిస్టర్ సార్ నా వల్ల కాలేదు



మూడు నెలల ముందు నుంచి టికెట్ బుక్ చేసుకోడానికి ట్రై చేసినా కుదరలేదు. గోదావరికి టికెట్ దొరకడం గగనమైపోయింది. అర్జెంట్ పని ఉండి హైదరాబాద్ వెళ్లేందుకు గోదావరి కోసం వచ్చాను. జనరల్ బోగీ ఎక్కాలని ప్రయత్నించాను. నా వల్ల కాలేదు. అయ్యా.. రైల్వే మినిస్టర్ సార్.. దేశంలో రైళ్లలో ప్రయాణించే వారిలో ఎక్కువ మంది సాధారణ ప్రయాణికులే ఉంటారు.

– ఎస్.ఈశ్వరరావు, ప్రయాణికుడు

కోయంబత్తూరు వరకూ ఇలాగేనా..



మాది శ్రీకాకుళం జిల్లా. మేం కోయంబత్తూరులో పనిచేస్తున్నాం. వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో శ్రీకాకుళం స్టేషన్‌లో ఎక్కాం. ఇద్దరం నిలబడటానికి కొంత ప్లేస్ దొరికింది. విజయవాడ వైపు వెళ్లే కొద్దీ రష్ పెరుగుతుంటుంది. అప్పటికి ఈ ప్లేస్ ఉంటుందో లేదో కూడా తెలీదు. దాదాపు 1,300 కిలోమీటర్లు వెళ్లాలి. రెండు రోజులు పడుతుంది. కోయంబత్తూరు వెళ్లేంత వరకూ ఈ నరకయాతన తప్పదు.

– దుర్గాప్రసాద్, రమేష్, ప్రయాణికులు

స్లీపర్ కోచ్‌లు పెంచాలి



ఎంతో ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నా సీటు కన్ఫర్మ్ కాలేదు. ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండటంతో సీటు లేకున్నా అడ్జస్ట్ అయి వెళ్తున్నా. అందరూ ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించ లేరు కదా! స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఎక్కువ వేస్తే ఉపయోగంగా ఉంటుంది. జనరల్ ప్రయాణికులు కూడా రిజర్వేషన్ బోగీల్లో ఎక్కడం వల్ల రిజర్వేషన్ చేయించుకున్నా ఉపయోగం లేకుండా పోతోంది. జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌ల సంఖ్యను పెంచాలి.

– పి.భవేష్‌కుమార్, బెంగళూరు

న్యూస్‌రీల్

జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికలకు 20 నామినేషన్లు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికలకు 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లకు సంబంధించి కమిషనర్ పి.సంపత్‌కుమార్ పరిశీలించి అభ్యర్థుల జాబితా ప్రకటించారు. నామినేషన్ వేసిన వారిలో అక్కరమాని రోహిణి, రెయ్యి వెంకటరమణ, ఇమ్రాన్ అహ్మద్, బిపిన్‌కుమార్ జైన్, ముర్రు వాణి, తోట పద్మావతి, నక్కెళ్ల లక్ష్మీ, పల్లా అప్పలకొండ, సాడి పద్మావతి, శరగడం రాజశేఖర్, బొమ్మిడి రమణ, నొల్లి నూకరత్నం, గల్లా పోలిపల్లి, పిల్లా మంగమ్మ, బల్లా శ్రీనివాసరావు, లక్ష్మీబాయి పులి, గొలగాని వీరారావు, విల్లూరి భాస్కరరావు, పిసిని వరహా లక్ష్మీ నరసింహం, కరజాడ వెంకట నాగ శశికళ ఉన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ నోటీసు బోర్డులో ఈ జాబితాను ప్రదర్శించారు. బుధవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, ఆగస్టు 3 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 7వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.65 కోట్లు

సింహాచలం : వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 34 రోజులకు గాను రూ.2,65,72,189 వచ్చినట్టు ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి తెలిపారు. తొలి రోజు రూ.1,97,06,300 నగదుతో పాటు 100.950 గ్రాముల బంగారం, 11.800 గ్రాముల వెండి లభించగా.. రెండో రోజు మంగళవారం 20 హుండీల ద్వారా రూ.68,65,889 నగదు, 86 గ్రాముల బంగారం, 1.700 కిలోల వెండి వచ్చినట్టు తెలిపారు. మొత్తం రెండు రోజుల్లో రూ.2,65,72,189 ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే మొత్తం బంగారం 186.950 గ్రాములు, వెండి 13.500 కిలోలు వచ్చినట్టు వివరించారు.

పింఛన్ల కోసం నగదు సమకూర్చండి

మహారాణిపేట: పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఆగస్టు 1, 2వ తేదీల్లో మాత్రమే జరుగుతుందని, బుధవారం సాయంత్రంలోగా ఆయా అధికారులకు నగదును అందజేయాలని సూచించారు. కొన్ని బ్రాంచీలపైనే భారం పడకుండా వచ్చే నెల నుంచి పింఛన్ల ఖాతాలను అన్ని బ్రాంచీలకు సర్దుబాటు చేయనున్నట్టు తెలిపారు.

మసాజ్ కేంద్రాలపై దాడులు

- ఏకకాలంలో 71 స్పా సెంటర్లలో 71 బృందాలతో సోదాలు
- ద్వారకానగర్‌లో కాక్‌టెయిల్ థాయ్ స్పాలో వ్యభిచారం గుర్తింపు
- నిర్వాహకుడు, మరో వ్యక్తి, విటుడు అరెస్ట్
- పునరావాస కేంద్రానికి ఆరుగురు మహిళలు
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 21 సెంటర్లకు నోటీసులు


స్పా సెంటర్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: మసాజ్ కేంద్రాలపై విశాఖ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. సోమవారం రాత్రి నగరంలో ఉన్న 71 స్పా సెంటర్లలో 71 బృందాలతో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో ద్వారకానగర్ ప్రాంతంలో ఒక స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించగా.. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 21 సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. విశాఖలో డ్రగ్స్, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెట్టేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులు పలు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా స్పా సెంటర్లపై నిఘా పెట్టాలని చెప్పారు. దీంతో సోమవారం రాత్రి కమిషనరేట్ పరిధిలో ఉన్న 71 స్పా సెంటర్లలో 200 మంది సిబ్బందితో సోదాలు చేశారు. ఇందులో కాక్‌టెయిల్ థాయ్ స్పా సెంటర్లలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకుడితో పాటు దానికి సంబంధించిన వ్యక్తిని, విటుడిని అరెస్టు చేశారు. కేంద్రంలో ఉన్న ఆరుగురు బాధిత మహిళలను పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే జీవీఎంసీ అధికారులు జారీ చేసే ట్రేడ్ లైసెన్సులు గడువు ముగియడం, లేబర్ సర్టిఫికెట్‌లో నమోదు చేసిన దాని కంటే ఎక్కువ మంది సిబ్బంది కలిగి ఉండడం, జీఎస్టీ సర్టిఫికెట్ లేకపోవడం, పన్నులు చెల్లించకపోవడం, ఇలా నిబంధనలు పాటించని 21 స్పా, మసాజ్ కేంద్రాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఆయా శాఖలకు అధికారులకు తదుపరి చర్యలు కోసం నివేదికలు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా మసాజ్ కేంద్రాల్లో వ్యవహరించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మోగిన నగారా

- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్
- అమల్లోకి వచ్చిన కోడ్

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నగారా మోగింది. ఈ మేరకు మంగళవారం విశాఖ కలెక్టర్, ఎన్నికల అధికారి హరేందిర ప్రసాద్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నారు. కాగా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గతంలో వైఎస్సార్ సీపీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపొందారు. ఆయన సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేనలో చేరడంతో శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఈ స్థానానికి గానూ ఇప్పుడు ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ముఖ్యమైన తేదీలివే..

ఎన్నికల నోటిఫికేషన్	ఆగస్టు 6
నామినేషన్‌కు చివరి తేదీ	ఆగస్టు 13
నామినేషన్ల పరిశీలన	ఆగస్టు 14
నామినేషన్ విత్‌డ్రా	ఆగస్టు 16
పోలింగ్	ఆగస్టు 30
కౌంటింగ్	సెప్టెంబర్ 3

చట్టబద్ధమైన దత్తతే ఆనందమయం

- శిశువును వద్దనుకుంటే చెత్త కుప్పల్లో పడేయొద్దు
- 1098, 181, 100కు ఫోన్ చేసి అప్పగించండి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

మహారాణిపేట: చట్టబద్ధ దత్తతలను మాత్రమే ప్రోత్సహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం వైద్యులకు స్పష్టం చేశారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, కేజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ఎథిక్స్ గ్యాలరీలో 'అనధికార దత్తతలు, చట్ట ప్రకారం చర్యలు' పేరిట అవగాహన సదస్సు జరిగింది. గైనకాలజీ, పిల్లల విభాగం వైద్యులు, నర్సింగ్, సెక్యూరిటీ, పారా మెడికల్ సిబ్బందికి నిర్వహించిన సదస్సులో ముందుగా అధికారిక దత్తతలపై ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కేసలి అప్పారావు, గొండు సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఆస్పత్రుల్లో చంటి పిల్లలను దత్తతకు ఇస్తారన్న అపోహ నేటికీ బలంగా ఉండడం దురదృష్టకరమన్నారు. ఈ అపోహను రూపుమాపేందుకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రధాన ఆస్పత్రుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రసూతి, పిల్లల వార్డుల్లో సీసీ కెమెరాలు నిరంతరం పని చేయాలని, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

అలా.. పసికందులను పడివేయవద్దు

ఆస్పత్రుల్లో ప్రసవించిన తర్వాత బిడ్డను వద్దనుకునే వారు చెత్త కుప్పల్లో, మురికి కాలువల్లో పడివేయవద్దని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. 1098, 181, 100కు కాల్ చేసి శిశువును అప్పగిస్తే.. వారికి ప్రభుత్వం తరపున బంగారు భవిష్యత్ అందించిన వారవుతారన్నారు. ఈ సమాచారంపై, చట్ట వ్యతిరేక దత్తతలపై విస్తృతంగా ప్రచారం చేసే బాధ్యత వైద్యులు, సిబ్బంది తీసుకోవాలన్నారు. అధికారిక దత్తతను స్వీకరించాలనుకునే వారు వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనధికార స్వీకరణ వల్ల జైలు పాలవడమే కాకుండా.. వారి జీవితాలు ఛిద్రంగా మారతాయని హెచ్చరించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ విభాగం,శిశు గృహ సిబ్బంది రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ కారా చట్టం, అనధికార దత్తతలు, చట్ట ప్రకార పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ కుమార్, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా కళాశాలలు

ఎంవీపీకాలనీ: జిల్లాలోని కళాశాలలను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశించారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల యాజమాన్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్, సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. పలువురు ఆర్వోలు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- పథకాల పేర్లు మార్చినంత మాత్రాన అమలు చేసినట్లు కాదు..
- అభివృద్ధి, సంక్షేమ పాలనపై కూటమి దృష్టి సారిస్తే మంచిది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మండిపాటు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: భారత రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి నాయకులు ఈ 52 రోజుల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారని, 36 మంది ప్రాణాలను బలిగొన్నారని ఆరోపించారు. మరో 35 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. 1000కు పైగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 400 ప్రభుత్వ ఆస్తులు, 500 ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. టీడీపీ మూకలు మారణాయుధాలతో పోలీసులు చూస్తుండగానే.. దాడులకు, హత్యలకు పాల్పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కన్నా మంచి పరిపాలన చేస్తారని ప్రజలు మీకు అధికారమిస్తే.. మీరు చేసేది ఏమిటి..? హత్యలు, దాడులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?

తక్కువ ఎమ్మెల్యే సీట్లు వచ్చాయని అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం సరి కాదని కోలా గురువులు అన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట హామీలిచ్చి.. ఇప్పుడు అమలు చేయడానికి భయమేస్తోందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వంలో ఉలుకూ..పలుకూ లేదన్నారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఇవ్వలేదు.. ఉచితం ఇసుక అని చెప్పి గత ప్రభుత్వం కంటే ఎక్కువ వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. పథకాలకు పేర్లు మార్చినంత మాత్రాన ఫలితం ఉండదని.. ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని నిలదీశారు. మెడికల్ కళాశాలలు.. హార్బర్లు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని.. చివరి దశలో ఉన్న వాటిని పూర్తి చేసి ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి లేని పాలన అందించారని, ఆయనపై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి కొందరు స్వార్థంతో వీడుతున్నారని.. అలాంటి వారి వల్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జోనల్ విభాగ ఇన్‌చార్జి తుళ్లి చంద్రశేఖర్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షుడు పెంట్ర అప్పన్న, వానపల్లి ఈశ్వరరావు, సకల భక్తల ప్రసాద్, రాష్ట్ర యువజన విభాగం, జిల్లా అనుబంధ కమిటీ సభ్యులు జగ్గుపల్లి నరేష్, అనురాధ, మోహన్, పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

బడ్జెట్ చర్చా వేదికలో వక్తల స్పందన


మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

డాబాగార్డెన్స్ : బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర నష్టం జరిగిందని, అమరావతి రాజధానికి 15 వేల కోట్లు రుణం రూపంలో ఇవ్వడం సరైంది కాదని, గ్రాంట్ రూపంలో ఇవ్వాలని పలువురు వక్తలు కోరారు. కేంద్ర బడ్జెట్ 2024-25పై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ జస్టిస్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో చర్చా వేదిక నిర్వహించాయి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విస్తరిస్తున్న ఆర్థిక అసమానతలు, అధిక ఆహార ద్రవ్యోల్బణం, తగ్గిపోతున్న ప్రైవేట్ పెట్టుబడుల నేపథ్యంలో కేంద్ర బడ్జెట్ 2024-25 సరైన పరిష్కారం చూపడంలోనూ, ఆంధ్ర రాష్ట్రానికి నిధులు కేటాయించడంలోనూ విఫలమైందని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, విక్రమ్ సింహపూరి యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావు, ప్రొఫెసర్ కె.నళిని, ప్రొఫెసర్ కె.పద్మ, వి.రామస్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో ఆహార సబ్సిడీ, గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, ఎరువుల సబ్సిడీ, సాంఘిక సంక్షేమ నిధులు భారీగా కోతకు గురయ్యాయని, మధ్య తరగతి ప్రజలకు ఆదాయ పన్ను రాయితీలు ఇవ్వలేదని, కానీ కార్పొరేట్‌లకు పన్ను రాయితీలు ఇచ్చి రూ.లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేటీకరణను ప్రోత్సహించేలా ఉందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధికి ఈ బడ్జెట్ ప్రాధాన్యత ఇవ్వకపోగా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగిస్తుందని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణను ఉపసంహరిస్తూ ప్రకటన చేయలేదని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు మేధావులు, వివిధ అసోసియేషన్ ప్రముఖులు పాల్గొన్నారు.

అబద్ధాల అనిత!

- పోలీస్ కార్యాలయంలో హోం మంత్రి అనిత రాజకీయ విమర్శలు
- ఐపీఎస్‌లను పక్కన కూర్చోబెట్టుకొని మరీ వైఎస్సార్ సీపీ పాలనపై ఆరోపణలు
- రాజకీయ వేదికగా మారిపోయిన పోలీస్ సమావేశ మందిరం
- గంజాయి నియంత్రణ, పోలీస్ వాహనాలు, సిబ్బంది సంక్షేమంపై అవాస్తవాలు
- గత అయిదేళ్లలో పోలీసులు పనిచేయలేదన్నట్లు పరోక్ష ప్రకటనలు
- నోరెళ్లబెట్టిన పోలీస్ ఉన్నతాధికారులు

విశాఖ సిటీ: నోరు విప్పితే అబద్ధం. అడ్డూ అదుపూ లేకుండా ఉద్దేశపూరిత విమర్శలు.. ఊహించని పదవి వరించడంతో ఇష్టానుసారంగా రెచ్చిపోయి ఆరోపణలు.. అధిష్టానం మెప్పు కోసం తాపత్రయపడుతూ హడావుడి చేస్తున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని రాజకీయ వేదికగా మార్చేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం పెట్టి.. అదనపు డైరెక్టర్ జనరల్, ఐజీ స్థాయి అధికారులను పక్కన కూర్చోబెట్టుకొని మరీ రాజకీయ దురుద్దేశ ఆరోపణలు గుప్పించారు. వాస్తవాలను కప్పిపుచ్చి, నోటికొచ్చినట్లు అవాస్తవాలను చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో పోలీస్ అధికారులు పనిచేయలేదనట్లు పరోక్ష విమర్శలు చేశారు. పాపం.. ఐపీఎస్ అధికారులు సైతం మంత్రి ఆరోపణలకు అడ్డుచెప్పలేక, నోరువిప్పలేక తలూపడానికే పరిమితమయ్యారు.

గంజాయిపై కప్పగెంతులు


కాపులుప్పాడలో 22వేల కేజీల గంజాయిని దహనం చేస్తున్న అప్పటి సీపీ శ్రీకాంత్)

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ గంజాయి కేంద్రంగా మారిందని విపరీతంగా ప్రచారం చేశారు. టీడీపీ అధికారం చెపట్టాక గంజాయి నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక అంటూ హడావుడి చేశారు. ఇప్పటి వరకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా గంజాయి రవాణ చేస్తున్న వారిని పట్టుకోవడం మినహా.. ఉమ్మడి విశాఖలో ఒక్క చోట కూడా గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసిన సందర్భాలు లేవు. వాస్తవానికి విశాఖలో ఎక్కడా గంజాయి సాగు లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న పంటలను సైతం గత ప్రభుత్వ హయాంలో గుర్తించి ధ్వంసం చేశారు. ఇదే విషయాన్ని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన రోజునే మీడియాతో స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాను రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలోనే అల్లూరి జిల్లాలో దాదాపుగా గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. హోం మంత్రి అనిత మాత్రం అల్లూరి జిల్లాలో గంజాయి సాగు ఎక్కువగా ఉందని ఆరోపణలు చేశారు. అలా ఉంటే.. ఇప్పటి వరకు ఎందుకు వాటిపై చర్య తీసుకోలేదన్నది మాత్రం మిలియన్ డాలర్ ప్రశ్న. ఇదిలా ఉంటే అప్పుడు విశాఖ సీపీ తప్పు చెప్పారా? ఇప్పుడు హోం మంత్రి రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేశారా? అన్నది త్వరలోనే తెలిసిపోతుంది. హోం మంత్రి అనిత అల్లూరి జిల్లాలో ఎన్ని వేల ఎకరాల్లో గంజాయి సాగు జరుగుతుందో గుర్తించి ధ్వంసం చేస్తారో వేచి చూడాలి మరి.

చెప్పేదొకటి.. చేసేదొకటి..

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో అశాంతి నెలకొంది. ఒకవైపు హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలతో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయింది. మరోవైపు కాలం చెల్లిన మద్యం విక్రయిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ప్రధానంగా విశాఖలో పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. అందుకు ఇటీవల వరుసగా పోలీసులపై జరుగుతున్న దాడులే నిదర్శనం. మహిళల భద్రతే తమ తొలి ప్రాధాన్యత అని చెప్పుకొస్తున్న హోం మంత్రి అనిత ఇప్పటివరకు రాంబిల్లి, అనకాపల్లి ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో బాధితులను కనీసం పరామర్శించిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో బాధిత కుటుంబాలకు రూ.లక్షలు నష్టపరిహారం అందించి భరోసా అందించగా.. ఈ టీడీపీ ప్రభుత్వంలో మాత్రం పైసా కూడా విదల్చడం లేదు. అలాగే ఎన్నికల ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాణ్యతలేని లిక్కర్ విక్రయిస్తున్నారని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, అనితలు.. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ అదే మద్యాన్ని విక్రయిస్తు న్నారు. కేవలం అధికారంలోకి రావడానికి అప్ప టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లినట్లు ఇప్పుడు అందరికీ స్పష్టంగా అర్థమవుతోంది. ఇదిలా ఉంటే.. అదే ప్రభుత్వ మద్యం దుకాణా ల్లో కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తుండడం ఇప్పు డు సంచలనంగా మారింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టినప్పటికీ.. ప్రభు త్వం గానీ, హోం మంత్రి అనిత గానీ ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం గమనార్హం.

సీపీ ఆఫీస్‌లో రాజకీయ విమర్శలా?


కమిషనరేట్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖ పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులను పక్కన పెట్టుకొని హోం మంత్రి రాజకీయ ఆరోపణలు చేయడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి పోలీస్ లేదా ఇతర ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా.. మంత్రులు ఎటువంటి సమావేశాలు నిర్వహించినా.. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావించడం అనవాయితీగా వస్తోంది. రాజకీయ ఆరోపణలు, విమర్శలకు ప్రభుత్వ అతిథి గృహం లేదా వారి క్యాంప్ కార్యాలయాల్లో మీడియా సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. గతంలో సర్క్యూట్ హౌస్‌లో మంత్రులు అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించగా.. రాజకీయ ఆరోపణలు చేసిన సమయంలో అధికారులు వెంటనే వేదికపై నుంచి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. కానీ హోం మంత్రి అనిత మాత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని రాజకీయ ఆరోపణలకు వేదికగా చేసుకున్నారు. కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ సీపీ ఫక్కీరప్ప, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నంలను పక్కన కూర్చోబెట్టుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకున్నట్లు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా వాస్తవాలను వక్రీకరించి.. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు అసలు పని చేయలేదన్న విధంగా ఆరోపణలు చేయడం గమనార్హం. గంజాయి నియంత్రణ, పోలీస్ అధికారులకు వాహనాలు, ఇతర సదుపాయాలు, సిబ్బంది సంక్షేమం, ఇలా అన్ని విషయాలపై అబద్ధాలు వల్లెవేశారు.

అధునాతన వాహనాలను సమకూర్చినా..


ఇసుజు వాహనాలను ప్రారంభిస్తున్న అప్పటి జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్

పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో కూడా హోం మంత్రి అనిత అబద్ధాలు వల్లెవేశారు. ముఖ్యంగా పోలీసులకు గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో వాహనాలు సమకూర్చలేదని, దీంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు చేశారు. 2014–19 మధ్య తెలుగుదేశమే అధికారంలో ఉంది. 'అప్పుడెందుకు పోలీసులకు వాహనాలను సమకూర్చలేదు? ఒకవేళ అప్పుడే కొనుగోలు చేస్తే.. వాహనాల కొరత ఎందుకు వచ్చింది? లేదా.. అవి రెండు, మూడేళ్లకే పాడైపోయాయా? మాయమైపోయాయా' అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయన్న విషయాన్ని విస్మరించారు. టీడీపీ పాలనలో పోలీసులకు వాహనాలను అందించకపోగా.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీపై తప్పుడు ఆరోపణలకు పూనుకున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో విశాఖ పోలీసులకు ప్రభుత్వం నుంచే కాకుండా కొన్ని పరిశ్రమలు, సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో వాహనాలు సమకూరాయి. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రత కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 163 అధునాతన దిశ పెట్రోలింగ్ వాహనాలను ఆవిష్కరించి విశాఖతో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కేటాయించారు. అలాగే 32 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలు, ఒక టోయింగ్, రెండు ఇసుజు వెహికల్స్ అందుబాటులోకి వచ్చాయి. హోం మంత్రి మాత్రం ఒక్క వాహనం కూడా అందించలేదని వాస్తవాలు వక్రీకరించే ప్రయత్నం చేశారు. అలాగే గతంలో పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించినప్పటికీ.. పట్టించుకోలేదని మంత్రి ఆరోపణలు చేశారు.

పాపినేనికి రావిశాస్త్రి సాహితీ పురస్కారం


పాపినేనికి పురస్కారం అందజేస్తున్న శ్రీధర్

సీతంపేట: ప్రముఖ కవి, కథకుడు, విమర్శకుడు డాక్టర్ పాపినేని శివశంకర్‌కు 2024 సంవత్సరానికి సంబంధించి రావిశాస్త్రి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం రావిశాస్త్రి సాహితీ పురస్కార సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు ముఖ్యఅతిథి డాక్టర్ జి.ఆర్.శ్రీధర్ పురస్కారం అందజేశారు. అనంతరం పురస్కార గ్రహీత శివశంకర్ మాట్లాడుతూ రావిశాస్త్రి, కాళీపట్నం ఇద్దరూ ఉత్తరాంధ్ర ప్రజల జీవితాలకు బావుటాపట్టారని కొనియాడారు. రావిశాస్త్రి పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రావిశాస్త్రి రచనల్లో పాత్రలు, సాహిత్యంలోని వైశిష్ట్యాన్ని సభకు వివరించారు. జి.ఆర్.శ్రీధర్ మాట్లాడుతూ రావిశాస్త్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పేదవాళ్ల పట్ల వకాల్తా పుచ్చుకున్న శ్రీశ్రీ, రావిశాస్త్రి ఇద్దరు విశాఖ వారు కావడం గర్వకారణమన్నారు. జి.రఘు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాచకొండ ఉమా కుమార శాస్త్రి, రాచకొండ నృసింహశర్మ, జె.పి.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు ఆలస్యం, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: చక్రధర్‌పూర్ డివిజన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున హౌరా – ముంబయి మెయిల్ బారాబాంబూ స్టేషన్ పరిధిలో పట్టాలు తప్పడంతో ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని దారి మళ్లించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. రైళ్ల సమాచారం కోసం వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో కూడా హెల్ప్‌లైన్ సెంటర్‌లో 0891–2746330 / 0891–2744619 నంబర్లు ఏర్పాటు చేశారు.

పలు రైళ్లు రద్దు

ఆగస్టు 1న హౌరాలో బయల్దేరాల్సిన హౌరా – యశ్వంత్‌పూర్ (02863) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3న యశ్వంత్‌పూర్‌లో బయల్దేరాల్సిన యశ్వంత్‌పూర్ – హౌరా (02864) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, జూలై 31, ఆగస్టు 1, 2న ఎర్నాకుళంలో బయల్దేరాల్సిన ఎర్నాకుళం – టాటానగర్ (18189) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు...

టాటానగర్‌లో మంగళవారం బయల్దేరాల్సిన టాటానగర్ – ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ వయా రాజ్‌ఖర్‌సావన్, నయాగడ్, జాక్‌పూర, కటక్, పలాస, దువ్వాడ మీదుగా నడుస్తుంది.

ఎస్ఐలకు పోస్టింగ్‌లు

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు పలు పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్‌లు లభించాయి. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన జి.శ్యామలరావును మల్కాపురం లా అండ్ ఆర్డర్, పి.డి.బి.శంకర్‌ను ఆరిలోవ లా అండ్ ఆర్డర్, డి.సూరిబాబును పెందుర్తి క్రైం, ఎస్.సింహాచలంను టూ టౌన్ లా అండ్ ఆర్డర్, కె.నరసింగరావును ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్, కె.శ్రీనివాసరావును వన్ టౌన్ లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి విశాఖకు వచ్చిన ఎం.వి.రమణను మల్కాపురం క్రైం, కె.దేముడునాయుడును సీసీఎస్, పి.వి.రమణారెడ్డిని దువ్వాడ క్రైం, కె.సత్యనారాయణను ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా నియమించారు.

జీవీఎంసీకి ప్రత్యేక రికార్డు రూమ్

జోన్–4 కార్యాలయంలోనే పాత రికార్డులు

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీకి ప్రత్యేక రికార్డు రూమ్ సిద్ధమవుతోంది. ఇందుకోసం జోన్–4 కార్యాలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కారిడార్లన్నీ పదుల సంఖ్యలో బీరువాలు, కట్టలు కట్టలుగా పాత రికార్డులతో అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. ఇటీవల కమిషనర్ సంపత్‌కుమార్ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించగా.. ప్రతి ఫ్లోర్‌లోనూ కారిడార్లు అసహ్యంగా కనిపిస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటినీ భద్ర పరిచేందుకు ప్రత్యేక రికార్డు రూమ్‌ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కార్యాలయాల పరిశీలనకు వెళ్లిన సమయంలో జోన్–4లో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని గమనించిన కమిషనర్.. అక్కడ ప్రత్యేక రికార్డు రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గతంలో బ్యాంకు నడిపిన 3,500 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న గదిని స్పెషల్ రికార్డు రూమ్‌గా తయారు చేస్తున్నారు. ఈ బాధ్యతలను అదనపు కమిషనర్ వై శ్రీనివాసరావు, ఎస్ఈ సత్యనారాయణ రాజుకు కమిషనర్ అప్పగించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయనున్నామని.. అనంతరం ప్రధాన కార్యాలయంలోని పాత రికార్డులు, బీరువాలన్నీ.. ఇక్కడికి తరలించనున్నట్లు ఏడీసీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ రికార్డులను పర్యవేక్షించేందుకు ఓ సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లను కూడా నియమించనున్నట్లు వెల్లడించారు.

కార్మిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మద్దిలపాలెం: కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. నగరంలో ఓ హోటల్‌లో మంగళవారం కార్మిక సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్మిక సంఘాలు సూచించిన సమస్యలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలో వాటిని పరిష్కరిస్తామన్నారు.

తక్షణం 8వ వేతన సంఘం నియమించాలి


మాట్లాడుతున్న గోపాలకృష్ణ

డాబాగార్డెన్స్: దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ వేతన సంఘం నియమించాలని సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె. గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సిటు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అఖిల భారత సమస్యలతో పాటు విశాఖ రక్షణ రంగ ప్రత్యేక సమస్యలపై డిఫెన్స్ కో ఆర్డినేషన్ భాగస్వామి పక్షాలు వారం రోజుల పాటు చేస్తున్న ఆందోళనకు సిటు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. విశాఖపట్నం రక్షణ రంగ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అన్ని అలవెన్స్‌లు కలుపుకుని చేసిన అదనపు పని గంటలకు (ఓవర్ టైం) చెల్లించే విషయంలో తీవ్ర వివక్ష కొనసాగుతోందన్నారు. కోర్టు తీర్పులని తక్షణం అమలు చేసి, విశాఖ రక్షణ రంగంలో ఉన్న కార్మికులందరికీ అన్ని అలవెన్స్‌లపై ఓటీ లెక్క కట్టి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్. జ్యోతీశ్వర రావు, రెడ్డి వెంకట్రావు పాల్గొన్నారు.

600 పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు కృషి


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) కింద జిల్లాలో 600 వరకు పారిశ్రామిక యూనిట్లు స్థాపించేందుకు అధికారులు, బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ కోరారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీసీసీ(డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ–బ్యాంకర్ల) సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. స్టాండప్ ఇండియా పథకానికి అధిక ప్రాధాన్యమిచ్చి వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. ఎంటర్‌ప్రెన్యూర్స్, రైతులు, విద్యార్థులకు సులభతర విధానంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని వివిధ బ్యాంకులు అందించిన ఆర్థిక సాయం గురించి, 2024, మార్చి త్రైమాసికంలో చేరుకున్న లక్ష్యాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కల్పనకు సంబంధించిన పథకాలపై అందరూ దృష్టి సారించాలని, పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పేందుకు ఆసక్తి చూపే ఔత్సాహికులకు తగిన సహకారం అందించాలన్నారు. స్టాండప్ ఇండియా పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణ చెల్లింపు గడువును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలన్నారు. ఎల్‌డీఎం శ్రీనివాసరావు, ఆర్బీఐ ప్రతినిధి పూర్ణిమ, పరిశ్రమల శాఖ జీఎం గణపతి, డీఆర్డీఏ పీడీ శోభారాణి, వ్యవసాయ అధికారి అప్పలస్వామి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: వి డెంటల్, వి హెల్త్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని 'సాక్షి'విశాఖ యూనిట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. వీరికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అలాగే దంత, కంటి వైద్య సేవలు, ఫిజియోథెరపీ, ఈఎన్‌టీ, సైకాలజిస్ట్ సేవలు అందించారు. వైద్యులు ఉషారాణి, అన్నపూర్ణారావు, తరుణ్‌తేజ్, ప్రవీణ్, పి.శ్రీరామ్మూర్తి ఉద్యోగులను పరీక్షంగా.. వి హెల్త్ డైరెక్టర్ రమేష్ పర్యవేక్షించారు. 'సాక్షి' బ్యూరో చీఫ్ రాఘవేంద్రరెడ్డి, యూనిట్ మేనేజర్ చంద్రరావు, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, మిత్ర పక్షాల తీరు సిగ్గు చేటు

- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు.. అధికార పక్షంలో మౌనముద్ర
- కుసులవాడ కొండల్లో మైనింగ్ వద్దు
- కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి
- డిమాండ్ చేసిన సీపీఎం నేతలు


మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం సిగ్గు చేటని టీడీపీ, మిత్ర పక్షాలపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనందపురం మండలం కుసులవాడ గ్రామ సర్వే నంబర్ 104లో మైనింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని, ఈ కొండలు ధ్వంసానికి పూనుకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొండలను తవ్వుకుంటూ పోతే పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం రుషికొండ ధ్వంసం చేసిందని తెలుగుదేశం, మిత్ర పక్షాలు గగ్గోలు పెట్టాయని.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మైనింగ్ కోసం కొండలు తవ్వేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తే ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. కుసులవాడ గ్రామ సర్వే నంబర్ 104లో 7.991 హెక్టార్లలో రఫ్ స్టోర్ గ్రావెల్, క్వార్ట్‌జైట్ మైనింగ్‌కు వీఆర్ ఇన్‌ఫ్రా అండ్ టెక్నాలజీస్ సంస్థకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. ఇందుకు సంబంధించి వచ్చే నెల 28న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు సిద్ధపడుతున్నారని, కొండలు, ప్రకృతిని ధ్వంసం చేస్తే పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర ప్రమాదమని ఆవేదన వ్యక్తం చేశారు. కుసులవాడ కొండలు ధ్వంసం వల్ల ఆ ప్రాంతంలోని జీడి, మామిడి, కొబ్బరి తోటలతో పాటు ఇతర పంటలకు అపార నష్టం జరుగుతుందన్నారు. గాలి, తాగునీరు కలుషితమవుతాయని.. కాలుష్య ప్రమాదం పెరుగుతుందని, తుపాను వంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మైనింగ్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయించి.. కొండల ధ్వంసాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


గణేష్‌కుమార్ మృతదేహం

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లికి చెందిన వి.సాయిగణేష్‌కుమార్ (21) చింతలవలస వద్ద ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితుడు తేజేష్‌తో కలిసి భీమిలి బీచ్ చూసేందుకు బైక్‌పై వచ్చాడు. అక్కడి నుంచి బీచ్‌రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బల వరకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో సాయిగణేష్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో చనిపోయాడు. తేజేష్‌కు గాయాలయ్యాయి. సాయి గణేష్ తండ్రి ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తున్నారు. అతనికి సాయి పెద్ద అబ్బాయి. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

మను..చరిత్ర సృష్టించాలి

విశాఖ స్పోర్ట్స్: పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత షూటర్ మను భాకర్ మూడో పతకాన్ని సొంతం చేసుకోవాలని విశాఖ క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు. 1900లో తొలిసారిగా భారత్ తరపున ఒకే ఒలింపిక్స్‌లో నార్మన్ రెండు పతకాలను సొంతం చేసుకోగా ఇన్నేళ్లకు మరోసారి చరిత్ర లిఖితమైంది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ షూటింగ్‌లో కాంస్య పతకం సాధించిన భారత షూటర్ మను మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సరబ్జోత్‌తో కలిసి కాంస్యపతకాన్ని సాధించింది.

ఇక ఇదే ఒలింపిక్స్‌లో 25 మీటర్ల షూటింగ్‌లోనూ మను పోటీపడుతోంది. ఈ ఈవెంట్‌లోనూ పతకం సాధించి ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు సాధించి.. చరిత్ర లిఖించాలని గోపాలపట్నం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో విశాఖ క్రీడాకారులు ఆకాంక్షించారు.


మనుకు శుభాకాంక్షలు చెబుతున్న విశాఖ క్రీడాకారులు